స్కెచ్

# రమాదేవి ఉత్తరం

కొమ్మూరి ఉషారాణి

“ఈ ఉత్తరం మీకు ఆశ్చర్యాన్ని కలిగించ వచ్చు. జాబు వ్రాయక పోయినా మిమ్మల్ని నేను ఎన్నడూ మరచిపోలేదు. నా కేవయినా మంచి రోజులు వస్తాయేమో, జీవితంలో ఎప్పటికయినా వెలుగుని చూడగలనేమో వ్రాద్దామని వూరుకున్నాను. కానీ ఆ సూచనలేవీ కనుపించటము లేదు. చదువు దారిన చదువు పోయింది. ఇక తతిమ్మా విషయాలు అంతంత మాత్రముగానే వుంటున్నాయి. ఎన్నో సార్లు మీకు జాబు వ్రాద్దామని అనిపించింది. కానీ అన్నీ నా గొడవలు ఏకరువు పెట్టటానికే కదా అని వూరుకున్నాను. ఏమిటో 'మీకు' అనేటప్పటికి అన్నీ నా విచారాలే వ్రాయ బుద్ధి పుడుతుంది.”

ప్రభ పేజీ తిప్పింది. ఒక్క క్షణంపాటు ఆమె మనసంతా ఏదో అవ్యక్తమైన బాధతో నిండిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఆమె భర్త, దగ్గిరగావచ్చి నిలబడి, ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. ఆమె మౌనంగా తన చేతిలోని కాయితం అతనికి అందించి దీపం దగ్గిరగా జరిగి, తిరిగి ఉత్తరం చదవటం ప్రారంభించింది.

“నేను ఎప్పుడైనా ఇలా ఉత్తరాలు రాస్తే మీకు యిబ్బందిగా వుండదనీ, నా కష్టసుఖాలు తెలుసుకోవాలనే కోరిక మీలో యింకా వుందనీ నమ్ముతున్నాను. ఊహించిన సుఖాలెన్నో దూరంకాగా, నేను ప్రాణమిచ్చి, యిష్టపడిన స్నేహితులుకూడా నన్ను మరచిపోతారేమో అనే అనుమానం, భయం వుంటే నేను యింకా ఈ భూమ్మీద వుండగలిగేదాన్ని కాదేమో.

ఒక్కొక్కప్పుడు ఏవో అజ్ఞాతశక్తులు నన్ను లోబరచుకుంటున్నాయనీ.పరిస్థితుల వత్తిడి వల్ల నాకు ఊపిరాడకుండా అయిపోతోందనీ భయమేస్తుంది. నన్ను చూస్తే నాకే ఏదో అసహ్యమేస్తుంది. మరి కొంతప్పుడు మళ్ళీ వెనక్కి తిరిగి చూడకుండా, కొన్ని వందలమైళ్ళు, అలా ఎక్కడికయినా పారిపోవాలనే విపరీత వాంఛ కలుగుతుంది. అంతేకాదు; నా నిస్సహాయత నన్నే వెక్కిరించి, దిగులు పుట్టించి, మన క్షోభ కలిగించే క్షణాలూ వున్నాయి. కానీ ఎటువంటి హీనపరిస్థితిలోనూ పూర్తిగా కృశించి పోకూడదని నాకు నేనే ధైర్యం చెప్పుకుంటుంటాను.

ప్రస్తుతం నేను సీతమత్తయ్య యింట్లోవుంటున్నాను. ఆమె నా దూరపు బంధువు. సత్తెకాలపు మనిషి. అమాయకురాలు. ఆవిడకి నా మీద ప్రత్యేకం ఆపేక్ష అంటూ ఏమీలేదు. నేను ఒక అనాధని. ఆమె నాకు ఆశ్రయం యిచ్చింది. అంతకు మించి మా యిద్దరిమధ్యా ఇక ఎటువంటి సంబంధమూ ఏర్పడలేదు. నేను రోజూ వేళకి భోంచేస్తున్నానో లేదో, కట్టుకుందుకి బట్టలున్నాయే లేవో చూసేవంతు ఆమెది. ఆమె కోసం యింటికి వచ్చే, అతిథులకీ, బంధువులకీ, చక్కగా ముస్తాబై, నవ్వుముఖంతో ఎదురువెళ్ళి, ఆమె నన్ను ఎలా సుఖపెడుతున్నదీ చాటే వంతు నాది.

ఇక ఆమె భర్త మూర్తిగారు. ఒక్కొప్పుడు కొన్ని రోజులపాటు ఆయన్ని నేను కలుసుకోనే కలుసుకోను. పొద్దుట లేచింది మొదలు బోలెడన్ని పనులు ఆయనకి. ఎంగేజిమెంట్లు, ఫోన్ కాల్సు, అతిథులు - క్షణం తీరిక వుండదు ఆయనకి.

ఇక తతిమ్మా వారి విషయము. మూర్తిగారిది చాలా పెద్ద సంసారము. ఇంటి నిండా పిల్లలు; పెద్దలు, ఎంతోమంది వున్నారు. అంతా బాగా పెద్ద చదువులు చదువుకున్న వారే. తిండి, బట్ట, మొదలైనవాటికి ఏ లోటూ

లేని పరిస్థితిలో వున్నారు. కానీ వాళ్ల ముఖాల్లో ఎప్పుడూ హాయైన నవ్వు చూడలేదు నేను. ఏదో నాటకరంగం మీదలాగ ప్రవేశిస్తారు. నిష్క్రమిస్తారు. ఒకరితో ఒకరు మనసిచ్చి హాయిగా మాట్లాడుకోరు. ఏ విషయముమీద ఓ పది నిముషాలపాటు కబుర్లు చెప్పుకోలేరు. ఒకరి అభిప్రాయాలు ఒకరికి తెలియబరచ టానికి జంకుతారు. ఒకరి హృదయానికి ఒకరు దగ్గిరగా జరగలేరు. నిత్యం ఒకర్ని చూస్తే ఒక రికి అనుమానం, భయం. అంతరాంతారాలలో పరస్పర ద్వేషం ఏదో వుండేమో అనిపిస్తుంది. ఎప్పుడూ ఎవరో వెనుకనుంచి తరుముతున్నట్లు భయం, శంక, విసుగు—కళావిహీనమైన ముఖాలవి. అలసట ఎరగని హృదయాలవి. ప్రశాంతతలేని జీవితాలవి. అందుకనే నాకు మూర్తిగారిని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. జీవిత మంతా డబ్బు సంపాయించటానికే ప్రయాస పడతారుగానీ, ఒక్కసారి వెనక్కి తిరిగి, ఆ డబ్బు ఎవరికి, ఎలాటి సుఖమిస్తుందో పరిశీ లించరేం? కనీసం అందుకు ప్రయత్నమైనా చెయ్యరేం అనిపిస్తుంది.

ఆయన తత్వం మొదట్లో నాకు బోధ పడిందికాదు. చదువుకుంటానంటే నవ్వుతూ తల వూపేశారు. అదే వుద్యోగం చేస్తానంటే, కళ్లెర్రచేసి, నావంక చాలా ఏవగింపుతో చూశారు. "ఏం! నలుగురిలో అల్లరి పెడదా మని చూస్తున్నావా? పరువూ, మర్యాదా లేని వాడి ననుకుంటున్నావా" అని నన్ను బెదిరిం చారు. నా కాళ్లమీద నేను నిలబడి, స్వతం త్రంగా జీవించే అవకాశం కల్పించుకోవటం, ఆయన మర్యాదనీ, పరువునీ ఎలా నష్టపరి చేదో నేను అర్థం చేసుకోలేక పోయాను. ఆయ నతో ఘర్షన పడ్డాను. నా ఒక్కదాని విషయం లోనే కాదు, అసలు మనుష్యులు ఎలా బ్రతక వలసిందీ, ఏ ఏ నైతిక సూత్రాలని పాటించ వలసిందీ. టూకీగా చెప్పేశారు మూర్తిగారు. నేను ఒక్కటే ప్రశ్న అడిగాను. "ఈపని మీ మర్యాదకీ, గౌరవానికీ అంతరాయం కలిగించ దని నాలో ఒక దృఢనమ్మకముంది. అలా టప్పుడు చేస్తే ఏం?" అన్నాను. ఆయన ససేమిరా ఒప్పుకోలేదు. కావాలంటే యింకా చదువుకోమన్నారు. బీచికీ, పిక్చర్లకీ, పార్టీలకీ వెళ్ళి సరదాగా కాలం వెళ్ళబుచ్చమన్నారు. కానీ ఆర్థికంగా ఏ లోటూ లేని నేను వుద్యోగం చేయటంలో అర్థంలేదనీ, అది తన పరువుకి నష్టం కలిగిస్తుందనే వాదనని మటుకు విడవ లేదు.

నాకు చాలా చిరాకు కలిగింది. "మీరు చెప్పినవేవీ నేను నమ్మను. ఈ పార్టీలు, పిక్చర్లు నాకు ఎటువంటి సంతృప్తినీ ఇవ్వడం లేదు. ఇక గౌరవం మాట అంటారా మీ గౌర వాన్ని నేనూ. నా గౌరవాన్ని మీరూ ఇలా ఎన్నాళ్ళో కాపాడుకుంటూ కూర్చోలేము. ఒక మనిషికి విలువ, ఘనత అనేది ఆ మనిషి వ్యక్తిత్వాన్ని బట్టి వస్తుంది, కానీ ఆ మనిషి చుట్టూ వుండేవారు కానీ, డబ్బు, కీర్తి, అధి కారం లాటివిగానీ, గౌరవాన్ని తెచ్చిపెట్టలేవు. అలా గౌరవం సంపాదించగలమనుకోవట వట్టిభ్రమ. ఆత్మవంచన. మన కళ్ళని మనమే గట్టిగా మూసేసుకోవటం లాంటిది" అన్నాను.

ఆవేశంలో ఆయన ఎదుట ఏమేమో అనే శాను. నిజానికి ఆయన మనసు నొప్పిద్దామని నాలో ఎటువంటి దురుద్దేశమూలేదు. కేవలం ఆశ్రయం కోసరం ఆయన యిల్లుచేరినదాన్ని, అలా మాట్లాడితే నన్ను ఎవరూ క్షమించరని నాకు తెలుసు. కానీ ఏంచెయ్యను? ఎన్నాళ్ళు ఈ ముసుగులో బ్రతుకు? ఎన్నాళ్లు ఈ శుష్క ప్రియవచనాలు? ఎన్నాళ్ళు హృదయంలేని ఈమనుష్యుల మధ్య బ్రతకటం అనిపించింది.

ఆ తర్వాత రెండు రోజులు యింట్లో ఎవరి ముఖమూ సరిగ్గా చూడలేకపోయాను. నేను తప్పుచెయ్యలేదని తెలిసివుండీ, ఎదటి వ్యక్తి చాలా మూర్ఖంగా, అన్యాయంగా ప్రవర్తిస్తున్నా రని తెలిసివుండీ, నేను ఆయన్ని క్షమాపణ కోరటానికి వెళ్ళాను. ఆయన నన్ను క్షమించారు.

నిజంగా ఒక మనిషికి అంతకంటె హీనస్థితి ఇంకేముంటుంది? ఒక వ్యక్తి తన మనసు లోని భావాలని అణచివేసుకుని, తాను దేనిని

సత్యమని నమ్ముతాడో దాన్నే పైకి చెప్పేటందుకు భయపడే పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆ జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో ఊహించుకోండి. అందుకే ఆ రోజు మొదలు నాలో ఒక విచిత్రమైన మార్పు వచ్చింది. నన్ను నేనే అసహ్యించుకునే మనోవైకల్యానికి గురి అయాను.

ఇంకా విశ్వనాథం అప్పుడప్పుడూ యిక్కడికి వస్తూనేవున్నాడు. అతను మీకు గుర్తున్నాడనుకుంటాను. మనిషి మంచివాడల్లనే కనుపిస్తాడు. చదువుకున్నవాడు. ఉద్యోగం చేస్తున్నాడు. తనని పెళ్ళిచేసుకుంటే నేను ఎన్ని విధాల, ఎంతటి సుఖం పొందగలనో, తనలో ఎంతటి సుగుణ సంపత్తి, త్యాగబుద్ధీ, ఉదారతా వున్నదీ సమయం దొరికినప్పుడెల్లా నాతో చెప్పేవాడు. అతనితో మాట్లాడుతుంటే నాకు బాగానే వుండేది. కానీ ఒక్కటే అనుమానం కలిగేది. ఇతను ఎంతసేపూ తన విషయమే మాట్లాడుతాడుగానీ నా విషయం ఏమీ తెలుసుకోవటానికి ప్రయత్నించదేమా అనిపించేది.

అంతేకాదు; ఒకవిధంగా విశ్వనాథం చాలా అదృష్టవంతుడనే అనాలి. అతను ఏ విషయాన్ని గురించి లోతుగా ఆలోచించలేడు. ఏ సమస్యనీ, విచారాన్నీ, బాధనీ హృదయానికి అంతగా పట్టించుకోడు. ఏ విషయంమీదా ఇదమిద్ధమని కొన్ని అభిప్రాయాలనీ, భావాలనీ ఏర్పరుచుకో లేదు. తను, తన సుఖం, తన డబ్బు, తన జీవితమేకాక ఈ ప్రపంచంలో ఇంకా అనేక విషయాలున్నాయనే సంగతి అతనికి తెలియదు. ఒకవేళ ఎవరైనా అలా అని చెప్పినా అతను నమ్మడు. జీవితాన్ని ఒక కోణం నుంచే అతను చూడగలిగాడు. అదే అతనికి అతి సుందరంగా కనుపించింది. కనుక దాన్నే యధార్థమని నమ్మాడు. ఈ ప్రపంచంలో అందరూ దేనివెంట పరుగెడుతున్నారో (అది డబ్బు కానివ్వండి, కీర్తి కానివ్వండి, అధికారం కానివ్వండి) దానివెంటే మనమూ పరుగెత్తాలనీ, అప్పుడే జీవితంలో విజయాన్ని సాధించగలమనీ, అంటాడు. దానికి భిన్నంగా ఆలోచించటము గానీ, ప్రవర్తించటము గానీ, కోరి జీవితాన్ని నాశనం చేసుకోవటమే అవుతుందని అతని అభిప్రాయం.

అజ్ఞానమో, స్వార్థమో, అతనిది చాలా చిత్రమైన స్వభావం. నిజానికి అతని తత్వాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పలేను. అతని మీద నాకు ద్వేషం కలిగిందనీ అనలేను. కానీ ఒక్కటే తెలుసుకో గలిగాను. విశ్వనాథాన్ని పెళ్ళి చేసుకుంటే నేను సుఖపడలేను. అతన్నీ సుఖపెట్టలేను. అతని ప్రపంచం వేరు. నా ప్రపంచం వేరు. ఒకవేళ సాహసించి పెళ్ళాడినా; పరస్పరం ఒకరినొకరం సంస్కరించుకోబోయి, అర్థంచేసుకోలేక, జీవితం దుర్భరం చేసుకుంటాము. విశ్వనాథం దేన్నయితే జీవితపు సర్వోన్నత శిఖరం అనుకుంటున్నాడో, అదే నాకు నైతిక పతనంలా కనబడినప్పుడు, మేమిద్దరమూ ఎలా కలిసి జీవించగలం?

విశ్వనాథాన్ని నిరాకరించి, అలా నిరాకరించినందుకు, నేనుగానీ, నా శ్రేయోభిలాషులుగానీ, విచారించవలసిన అవసరం లేదని తెలియజెప్పటానికి ఎంతో కష్టపడి, చివరికి విఫలు రాలనయాను. "అదృష్టంలేని జాతకం! ఎవరేం చెయ్యగలరు? నిక్షేపంలాంటి కుర్రాణ్ణి కాలదన్నుకుంటోంది" అని బాధపడింది సీతమ్మత్తయ్య. నేను చాలా తెలవితక్కువగా ప్రవర్తిస్తున్నాననీ, సొంత బుద్ధి అంటూ లేనప్పుడు, పెద్దలమాట విని బాగుపడాలనీ, హితబోధ చేశారు మూర్తిగారు. నిజంగా నాకు ఎంత పిచ్చెక్కించారంటే, అసలు ఈ ప్రపంచంలో విశ్వనాథం తప్పితే మరెవరూ నన్ను పెళ్ళి చేసుకోరేమో అనే అనుమానంకలిగింది నాలో.

ఎలాటి బలహీన క్షణంలోనూ, నిస్సహాయ స్థితిలోనూ ఆత్మప్రబోధాన్ని విస్మరించకూడదని తెలుసు నాకు. నేను ఏ సత్యాలను నమ్ముతున్నానో ఆ సత్యాలకోసం పోరాడాలని తెలుసు నాకు. కానీ పరిస్థితులు చెయిదాటిపోయి, బ్రతుకంటేనే ఏదో చెప్పలేని భయం, అలసట, దిగులు కలుగుతున్నాయి. ఈ నా అభాగ్య జీవితానికి కారణాలేమిటో, ఏశక్తులవల్ల నాలోని ఆత్మవిశ్వాసం, మనోబలంనశించిపోతున్నాయో తెలుసుకోవాలని వుంది—ప్రేమతో, రమ."